క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: గంగూరులో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. గంగూరు సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిర్వహణ కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని, గ్రామస్తులు సహకరించాలని కోరారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



పెనమలూరు: గంగూరు గ్రామంలో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ బుధవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో ఏఆర్ నగర్‌లో రూ. 15 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మించనున్నారు. నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయా ఆనంద్‌ప్రసాద్, అక్బర్‌పాషా, అబ్దుల్‌గౌస్, ఇర్ఫాన్, సలాం పాల్గొన్నారు.

వీహెచ్‌పీ జాతీయ ట్రస్టీగా పుట్టగుంట



హనుమాన్‌జంక్షన్ రూరల్: విశ్వహిందూ పరిషత్ జాతీయ ట్రస్టీగా హనుమాన్‌జంక్షన్‌కు చెందిన పారిశ్రామికవేత్త పుట్టగుంట వెంకట సతీష్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని మాజీ ఎంపీ, విశ్వ హిందూ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు చేతుల మీదగా బుధవారం అందుకున్నారు. మూడేళ్ల పాటు పుట్టగుంట ఈ హోదాలో కొనసాగనున్నారు. గతంలో ఉమ్మడి ఏపీ నుంచి గోకరాజు గంగరాజు, టీజీ వెంకటేష్, పుల్లారెడ్డి స్వీట్స్ అధినేత పుల్లారెడ్డి ఈ పదవి నిర్వహించారని పుట్టగుంట చెప్పారు. ఉన్నత, అధ్యాత్మిక విలువలు పాటిస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించే ప్రముఖ వ్యక్తుల్లో రాష్ట్రం నుంచి ఒకరికి మాత్రమే ప్రాతినిధ్యం కల్పిస్తారని, ఈ అవకాశం తనకు దక్కటం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉచితంగా ఆయిల్‌పామ్ మొక్కలు

గన్నవరం రూరల్: ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉచితంగా మొక్కలు అందిస్తోందని మండల హార్టికల్చర్ అధికారి ఇ.హరిచంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో ఆయిల్‌పామ్ మొక్క ఖరీదు రూ.193 కాగా ఒక హెక్టారుకు 143 మొక్కలను ఉచితంగా ఇస్తామన్నా

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

రామవరప్పాడు: ఎనికేపాడులో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. బుధవారం మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ నిధులు రూ. 2.40 కోట్లతో నూతన పైప్‌లైన్ విస్తరణకు అంచనాలు రూ పొందించినట్లు తెలిపారు. రెండు వాటర్ ట్యాంకుల వద్ద మోటార్లను అమర్చు తామన్నారు. త్వరలో పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తామ న్నారు.

మొక్కజొన్న సాగుపై అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్: మొక్కజొన్న సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఎంఏవో జొన్నలగడ్డ భవాని తెలిపారు. బాపులపాడు మండలం మల్లవల్లిలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్నలో ఎండు తెగులు నివారణకు ట్రైకోడెర్మా విరిడీ అనే శిలీంద్ర నాశిని పొడిని, ఎకరాకు రెండు కేజీలు, 100 కేజీల పశువుల ఎరువుతో కలిపి 10 రోజుల పాటుగా నిల్వ ఉంచి పొలంలో తేమగా ఉన్నప్పుడు చల్లాలని ఏవో చెప్పారు. వెటర్నరీ అసిస్టెంట్ ప్రియ, ఎల్‌వీపీ రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై..

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం సిరివాడలో రైతులకు పొడి దుక్కిలో విత్తనాలు వెదజల్లే పద్ధతిపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించటం వల్ల సుస్థిర వ్యవసాయం సాధ్యమని ప్రకృతి వ్యవసాయ విభాగం యూనిట్ ఇన్‌ఛార్జి ధనలక్ష్మి వివరించారు. విత్తనాల కిట్లను పంపిణీ చేశారు.

హైవే ఫుట్‌పాత్‌ల కబ్జా

- ఆక్రమణల చెరలో జాతీయ రహదారి ఫుట్‌పాత్‌లు
- ఫుట్‌పాత్‌లపై టీస్టాల్స్, దుకాణాల ఏర్పాటు
- ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల పర్యవేక్షణాలోపం
- పట్టించుకోని పోలీస్, పంచాయతీ అధికారులు
- ప్రమాదాలకు గురవుతున్న పాదచారులు



గన్నవరంలో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన దుకాణాలు

గన్నవరం: పాదచారులకోసం జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. దుకాణదారులు ఫుట్‌పాత్ స్థలాలను యథేచ్ఛగా ఆక్రమించుకుని వ్యాపార అవసరాలకు వినియోగించుకుంటున్నారు. దీంతో పాదచారులు రోడ్డుపై రాకపోకలు సాగిస్తూ ప్రమాదాల బారినపడుతున్నారు.

అధికారులు స్పందించాలి..

పాదచారులకోసం నిర్మిస్తే..

చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారి నియోజకవర్గంలో రామవరప్పాడు నుంచి బొమ్ములూరు వరకు సుమారు 40 కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఉంది. పాతికేళ్ల క్రితం జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించిన తర్వాత పాదచారులు నడిచేందుకు వీలుగా ప్రతి గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను నిర్మించారు. అప్పట్లో ఈ ఫుట్‌పాత్‌లు పాదచారులకు ఎంతో సౌకర్యవంతంగా ఉండేవి.

ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల పర్యవేక్షణలోపం..

అయితే ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది పర్యవేక్షణ లోపం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఫుట్‌పాత్‌లు క్రమంగా ఆక్రమణల చెరలో చిక్కుకున్నాయి. జాతీయ రహదారి పక్కనే ఉన్న దుకాణదారులు ఫుట్‌పాత్‌లను వ్యాపార అవసరాలకు వినియోగించుకుంటున్నారు.

ఫుట్‌పాత్‌లపై టీస్టాల్స్, బడ్డీకొట్లు..

మరి కొంత మంది దుకాణదారులు అయితే ఫుట్‌పాత్‌లను టీస్టాల్స్, హోటల్స్, బడ్డికొట్లకు అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో గన్నవరం, పెద్దఆవుటపల్లి, తేలప్రోలు, హనుమాన్‌జంక్షన్‌తో పాటు పలు గ్రామాల్లో ఫుట్‌పాత్‌లు నామరూపాలు లేకుండాపోయాయి. మరి కొన్ని చోట్ల అండర్ గ్రౌండ్ ఫైబర్ నెట్ కేబుళ్ల కోసం ఫుట్‌పాత్‌లను తవ్వివేశారు.

ఇప్పటికైన ఎన్‌హెచ్‌ఏఐ, పోలీస్, పంచాయతీ అధికారులు స్పందించి ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. దీనికోసం ఎన్‌హెచ్‌ఏఐ, పోలీసులు, గ్రామపంచాయతీ అధికారులు గతంలో మాదిరిగా ఉమ్మడిగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని పేర్కొంటున్నారు. ఈ సమస్యపై ఎన్‌హెచ్‌ఏఐ పీడీ నారాయణ రెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోనులో అందుబాటులో లేరు.

ఇక్కడ పునర్నిర్మాణం..

ఎయిర్‌పోర్ట్ కారిడార్ నిర్మాణంలో భాగంగా ఎయిర్‌పోర్ట్ నుంచి రామవరప్పాడు వరకు ఫుట్‌పాత్‌లను పునర్నిర్మించారు. దీంతో ఆ ప్రాంతంలో ఆక్రమణలకు కొంతమేర అడ్డుకట్టపడింది.

పాదచారులకు ప్రమాదాలు..

ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురికావడంతో పాదచారులు తప్పనిసరి పరిస్థితుల్లో నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారిపై రాకపోకలు సాగించాల్సి వస్తోంది. దీనివల్ల జాతీయ రహదారిపై వేగంగా దూసుకుపోయే వాహనాలు ఓవర్‌టేక్ చేసే క్రమంలో రోడ్డు పక్కన నడుచుకుని వెళ్లే పాదచారులను ఢీకొడుతున్నాయి. ఈ తరహా సంఘటనలు జాతీయ రహదారిపై నిత్యకృత్యంగా మారాయి.

ఇటీవల ప్రమాదాలు..

రెండు నెలల కిందట దుర్గాపురం వద్ద ఒక పాదచారుడిని కారుఢీకొంది. గాంధీబొమ్మసెంటర్, ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, సినిమాహాలు సెంటర్, కొత్తపేట ఏరియా పరిధిలో అనేక ప్రమాదాలు జరిగాయి. బాధితులు రాజీ పడటంతో కేసులు నమోదు కావటం లేదు.

ఆక్రమణలు తొలగించాలి..



ఎన్‌హెచ్‌ఏఐ, పోలీస్ అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించాలి. ఆటోమొబైల్స్ దుకాణాలు, హోటల్స్, టీస్టాల్స్ నిర్వాహకులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వ్యాపారం చేస్తున్నారు. వీరు చెత్తచెదారాలను ఎన్‌హెచ్ డ్రెయిన్లలో వేస్తున్నారు. దీనివల్ల పారిశుద్ధ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. పాదచారులు ప్రమాదాలకు గురయ్యేందుకు కారణమవుతున్నారు.

– ఆళ్ల కృష్ణకిశోర్, న్యాయవాది, గన్నవరం

శ్మశానవాటిక సమస్యపై తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మంగళాపురం గ్రామస్తులు

పాతపాడు(విజయవాడరూరల్): పాతపాడు గ్రామ శివారు మంగళాపురం గ్రామంలో పోలవరం కాల్వ వద్ద శ్మశానవాటికను కొనసాగించాలని గ్రామస్తులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు వినియోగిస్తున్న శ్మశానవాటిక ఆక్రమణలో ఉందని, ఎవరూ వినియోగించవద్దని ఓ వ్యక్తి అడ్డుకున్నారని సమాచారం. దీంతో గ్రామంలో వివాదం మొదలైంది. దీంతో మంగళాపురం గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాతపాడులో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు తరలివచ్చారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు గ్రామ సర్పంచి దేవగిరి సుజాత ఓంకార్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. తహసీల్దార్ బి.సుగుణకు మంగళాపురం గ్రామస్తులు వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలో శ్మశానవాటిక వద్దని ఎవరైనా అభ్యంతరం వ్యక్తం చేసేవారు ఉంటే చేతులు ఎత్తాలని తహసీల్దార్ కోరగా ఎవరూ ఆసక్తి చూపలేదు. ఇటీవల కొందరు ఆ స్థలంలో శ్మశానవాటిక వద్దని తనకు వినతి పత్రం అందజేశారని వారు ఎవరైనా ఉన్నారా అని అడిగారు. గ్రామస్తులు అంతా అదే స్థలంలో శ్మశానవాటికను కొనసాగించాలని అడుగుతున్నప్పుడు తమకు అభ్యంతరం లేదని తహసీల్దార్ వెల్లడించారు. దీంతో గ్రామంలో కొన్ని రోజులుగా నెలకొన్న సమస్యకు తెరపడింది. గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు సోమిశెట్టి రవీంద్రరావు, పసుపులేటి సాంబశివరావు, కొండేటి శ్రీనివాసరావు, కొండేటి వెంకటరత్నం, బొల్లెద్దుల రవి, ప్రసాద్ మహిళలు, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి మాట్లాడారు. రెవెన్యూ సదస్సులో పలు సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు. ఆర్ఐ రాజేష్, సర్వేయర్ జనార్ధనరావు, వీఆర్వోలు, దేవదాయశాఖ అధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనదిశగా కృషి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ జీఎల్ఎన్‌వీ రాఘవన్

విజయవాడరూరల్: సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించే విధంగా ఉద్యోగులు పనిచేయాలని విజయవాడ డివిజనల్ పంచాయతీ అధికారి జీఎల్ఎన్‌వీ రాఘవన్ అన్నారు. బుధవారం విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ శిక్షణా కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొమ్మిది థీమ్స్ అమలు జరిగేందుకు ప్రతి గ్రామ పంచాయతీలో ఒకటి చొప్పున స్వీకరించి వాటిని చిత్తశుద్ధితో అమలు చేసినట్టయితే లక్ష్యం నెరవేర్చవచ్చన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను జీపీడీపీకి అనుసంధానం చేసి కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డులను పొందడం ద్వారా అదనపు నిధులను సాధించుకోవచ్చన్నారు. అందుకు గ్రామాల్లోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందన్నారు. పీఆర్- 1 యాప్, స్వర్ణ పంచాయతీ యాప్ లను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.విగ్గిన్స్, ఈఓఆర్డీ ప్రసాద్, గ్రేడ్-1,4, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సత్వర సేవలకే రెవెన్యూ సదస్సులు



చలివేంద్రపాలెంలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న తహసీల్దార్ భావనారాయణ

కంకిపాడు: సత్వర సేవలు సమర్ధంగా అందించటమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని తహసీల్దార్ వీ భావనారాయణ అన్నారు. మండలంలోని చలివేంద్రపాలెం గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు రైతులు ధ్రువీకరణ పత్రాల కోసం అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భావనారాయణ మాట్లాడుతూ అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరించి మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. సర్పంచ్ బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి, ఆర్ఐ ఉస్మాన్, మండల సర్వేయరు భాస్కర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో బుధవారం తహసీల్దార్ కేవీ శివయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రైతులు తమ పట్టా భూములు రిజిస్ట్రేషన్ కాకుండా ప్రభుత్వ నిషేధిత జాబితాలో ఉంచారని, ఈ భూములు దశాబ్దాల నుంచి సాగు చేసుకుంటున్నామని వివరించారు. వారసత్వంగా సంక్రమించిన పొలాలకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. రైతులు 25 అర్జీలు అందజేశారు. సర్పంచ్ ఈలప్రోలు శ్రీనివాసరావు, వీఆర్వో శ్రీరామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ గ్రీన్‌తో మెరుగైన సేవలు

జిల్లా ఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి

కంకిపాడు: డిజిటల్ గ్రీన్‌తో రైతులకు మెరుగైన సేవలు అందుతాయని జిల్లా ఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిజిటల్ గ్రీన్‌పై బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. జ్యోతి మాట్లాడుతూ డిజిటల్ గ్రీన్ సంస్థ మూడు సంవత్సరాలుగా ఉద్యాన పంటలపై రైతులకు సేవలు అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ- మిర్ప 1.0లో వీడియోల రూపంలో సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారన్నారు. మెరుగైన సేవల లక్ష్యంతో ఈ- మిర్ప 2.0 అందుబాటులోకి తెచ్చారన్నారు. డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధి కమలాకర్ మాట్లాడుతూ సాంకేతిక సలహాలను అందించే విధంగా ఫార్మర్ చాట్ అప్లికేషన్‌ను రూపొందించామన్నారు. రైతులు తమ ఫోన్‌లలో ఫార్మర్ చాట్ యాప్ ద్వారా మెరుగైన సేవలు పొందవచ్చన్నారు. సదస్సులో ఉద్యానశాఖ అధికారులు ఎస్.రమేష్ (అవనిగడ్డ), ఈ.హరిచంద్ (బాపులపాడు), చందు జోసఫ్ సుందరం (కంకిపాడు), అవనిగడ్డ, మోపిదేవి, గన్నవరం, బాపులపాడు, కంకిపాడు, తోట్లవల్లూరు, ఉంగుటూరు, పెనమలూరు మండలాలకు చెందిన ఔత్సాహిక ఉద్యాన రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏపీ ఎన్‌జీఓ కంకిపాడు యూనిట్ అధ్యక్షుడు పురుషోత్తమరాజు

కంకిపాడు: ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ ఎన్‌జీఓ కంకిపాడు యూనిట్ అధ్యక్షుడు ఉండి వెంకట పురుషోత్తమరాజు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో కంకిపాడు యూనిట్ సమావేశం బుధవారం నిర్వహించారు. పురుషోత్తమరాజు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావలసిన డీఏ, జీపీఎఫ్ త్వరితగతిన ఇప్పించాలని విజ్ఞప్తిచేశారు. ప్రతి నెలా ఒకటిన ఇస్తున్న పింఛన్ల పంపిణీ ఉదయం 8 గంటల నుంచి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మహిళా ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను గుర్తించాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న వార్డు, విలేజ్ హెల్త్ సెక్రటరీలపై యాప్‌ల భారాన్ని తగ్గించాలని కోరారు. గ్రేడ్- 3 ఏఎన్ఎంలను వెంటనే ఎంపీహెచ్ఏ (ఎఫ్)గా ఉద్యోగోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు సురేష్, కోశాధికారి నీలాపు మురళీకృష్ణ, మహిళా కార్యదర్శి శ్యామల, నేతలు సాంబశివరావు, శివరామకృష్ణ పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలి



కంకిపాడు: హైందవ శంఖారావంను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ ప్రాంత ప్రచారక్ త్రినాథ్ పిలుపునిచ్చారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో హిందూ సమ్మేళనం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రచారక్‌లు త్రినాథ్, రంగప్రసాద్, టీవీఎస్ నాయుడు, మల్లికార్జున్ పాల్గొని జనవరి 5న నిర్వహించనున్న హైందవ శంఖారావం ప్రాధాన్యతను వివరించారు. హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి చేసి స్వయంప్రతిపత్తి కలిగిన ఒక ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగించాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేస్తుందన్నారు. హైందవ శంఖారావంను విజయవంతం చేయాలని కోరారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



అనురాధరెడ్డిని అభినందిస్తున్న డీన్ హరిబాబు

పెనమలూరు: జాతీయ స్థాయిలో జరిగిన షూటింగ్ బాల్ పోటీల్లో ఇంటర్ విద్యార్థిని అనురాధరెడ్డి బంగారు పతకం సాధించిందని డీన్ గుంటూరు హరిబాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం పోరంకి శ్రీ చైతన్య సరస్వతి సౌధంలో జరిగిన కార్యక్రమంలో డీన్ హరిబాబు వివరాలు వెల్లడించారు. తమ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీ చదువుతున్న పిట్టు అనురాధరెడ్డి ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఒరిస్సాలో జరిగిన జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో రాష్ట్ర నుంచి ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించిందన్నారు. త్వరలో జరగన్ను అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటుం దన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లో బంగారు పతకం, కత్తిసాములో కూడా బంగారు పతకం సాధించిందని హరిబాబు తెలిపారు. అనురాధరెడ్డిని అభినందాంచారు. ఏజీఎంలు మురళీ కృష్ణ, బి.శ్రీనివాసరావు పలువురు పాల్గొన్నారు.

యుక్త వయస్సులో మార్పులపై అవగాహన అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్, వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు

కంకిపాడు: యుక్తవయస్సులో వచ్చే మార్పులపై కిశోర బాలికల్లో అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ జిల్లా నోడల్ అధికారి పి.భానుమతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోరవికాసం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. భానుమతి మాట్లాడుతూ యుక్త వయస్సులో వచ్చే సమస్యలు, బాల్య వివాహాలపై అప్రమత్తం చేయాలన్నారు. స్కూల్ డ్రాపవుట్స్ లేకుండా చూడాలన్నారు. ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ మంచి, చెడు వ్యత్యాసం, తద్వారా కలిగే పరిణామాలపై అవగాహన కల్పించాలన్నారు. చిన్న తనంలో వివాహాలు చేయటం ద్వారా ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉందని వివరించారు. డెప్యూటీ తహసీల్దార్ ఏ.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సీడీపీఓ కేబీ సుకన్య, వాసవ్య మహిళా మండలి ఎన్‌జీఓ రాధిక, అశోక్, పటేల్, చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ టీ మేరీ, లీగల్ ఆఫీసర్ శైలజ, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. అనంతరం కంకిపాడులో కిశోర వికాసం, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

కార్యకర్త కుటుంబానికి అండగా వైఎస్సార్ సీపీ



బసవరావు భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న దేవభక్తుని చక్రవర్తి

కంకిపాడు: కార్యకర్తలకు, వారి కుటుంబాలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన కలపాల బసవరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. బసవరావు భౌతికకాయాన్ని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చక్రవర్తి సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. తన వంతుగా రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బందెల సుబ్బారావు, మాజీ సర్పంచ్ మాగంటి శ్రీనివాసరావు, నాయకులు వెంగల నాగయ్య, లాం సురేష్, లాం ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సంఘ నూతన కార్యవర్గం ఏకగ్రీవం



తహసీల్దారు వెంకట శివయ్యను కలిసిన వీఆర్ఏల సంఘ నూతన కార్యవర్గం

గన్నవరం: గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం గన్నవరం మండల అధ్యక్షులుగా మిరంపల్లి పూర్ణచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా గుండాల రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షులుగా మేదూరి జోస్పిన్, కోశాధికారిగా దూడి అనూష, సలహాదారులుగా పులిపాక ప్రసన్నరావు, సత్తెనపల్లి సుజాత, కమిటీ సభ్యులుగా ముచ్చింతల గీత, చిక్కవరపు శ్రీనివాసరావు, మాతంగి ఝాన్సీ రాణి, కందుల సుబ్బారావును ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ తహసీల్దారు వెంకటశివయ్యను మర్యాదపూర్వకంగా కలవగా, ఆయన అభినందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటరత్నం పాల్గొన్నారు.